## క్లుప్తంగా

### యాచకుడి మృతి



**కమలాపూర్:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండ్ ఆవరణంలో ఓ యాచకుడు సోమవారం మృతి చెందడాడు. గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. దీంతో మృతిచెందిన వృద్ధుడు ఆరెల్లి బజార్ (60)గా ధ్రువీకరించారు. సుమారు 40 ఏళ్ల క్రితం కమలాపూర్‌కు వచ్చిన బజార్ ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేసి జీవనం సాగించేవాడని స్థానికులు తెలిపారు. అతనికి బంధువులు ఎవరూ లేరని, అనాధ అని తేలడంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి జీపీ సిబ్బందితో కలిసి మృతదేహాన్ని ట్రాక్టర్ ద్వారా శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైన యాచకుడు బజార్ ఆకలికి అలమటించి మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు.

### గీత కార్మికుడికి గాయాలు



**వేలేరు :** వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన మండలంలోని ఎర్రబెల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంకటి లక్ష్మినారాయణ రోజు మాదిరిగానే ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో కాలు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా గమనించిన చుట్టుపక్కలవారు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

### రాజ్‌కుమార్‌కు సేవారత్న నేషనల్ అవార్డు



**ఎల్కతుర్తి:** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన మాడుగుల రాజ్‌కుమార్‌కు సేవారత్న నేషనల్ అవార్డు వరించింది. ఈ నెల 15వ తేదీన ఢిల్లీలో జరిగిన ఆలిండియా బహుజన రైటర్స్ నాలుగో నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమి (బీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవారత్న నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ బహుజన సాహిత్య అకాడమి నుంచి ప్రతీ సంవత్సరం ప్రజాఉద్యమకారులకు, కవులకు, రచయితలకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అవార్డులు అందజేస్తామని తెలిపారు. ఇండియాలోని 27 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది డెలిగేట్స్ కాన్ఫరెన్స్‌కు హాజరు అయినట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఢిల్లీ కేబినేట్ మినిష్టర్ డెలిహి సోషల్ వెల్‌ఫేర్ లేబర్ ఎంప్లయ్‌మెంట్ మినిష్టర్ రాజ్‌కుమార్ ఆనంద్, ఎమ్మెల్యే విశేష్‌రవి, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు మన్వీర్‌సింగ్, నేషనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ విజయలలిత, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏమేం గౌత్‌మ్ తదితరులు పాల్గొన్నారు. రాజ్‌కుమార్‌కు అవార్డు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### వైఎస్సార్‌టీపీకి దరఖాస్తు అందజేత



**ధర్మసాగర్:** మండల కేంద్రానికి చెందిన టీకుమట్ల విష్ణు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల సూచన మేరకు హనుమకొండ, జనగాం, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, అవకాశం ఇవ్వాలని కోరారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



సాయిశృతి

**శాయంపేట :** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మోరే సాయిశృతి జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ కరిత తెలిపారు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు పేరుతీసుకురావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు

● ఆడిపాడిన మహిళలు



ఆత్మకూరు : బతుకమ్మలు తీసుకొని మహిళలతో కలిసి వెళ్తున్న చల్లా జ్యోతి

**ఆత్మకూరు :** మండలంలోని పెద్దాపూర్‌లో బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి సోమవారం వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని పలు కాలనీల్లో కలియతిరుగుతూ మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలోని రామాలయం ఆవరణంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. ఈ సందర్భంగా చల్లా జ్యోతి మాట్లాడుతూ తొమ్మిది రోజులు జరుపుకునే వేడుకల్లో భాగంగా మూడో రోజు ముద్ద పప్పు బతుకమ్మ ఆడుతారని తెలిపారు. మూడో రోజు పెద్దాపూర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.

**ధర్మసాగర్:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలను ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుజరాత్‌లోని వడోదరలో సోమవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండకు చెందిన ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్ సభ్యులు గుజరాత్ టూర్‌లో భాగంగా వడోదరలో ముద్దపప్పు బతుకమ్మను తంగేడు, బంతిపూలతో పాటు వివిధ రంగుల పూలతో బతుకమ్మను పేర్చి సంబరాలు జరుపుకున్నారు. పూలను పూజించే సంస్కృతిని వివరిస్తూ వేడుకలు నిర్వహించామన్నారు. సాంస్కృతిక విభాగం కన్వీనర్‌లు సుమలత, సరళ, అధ్యక్షుడు ధర్మప్రకాష్, కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి మోహన్ రావు, టూర్ కన్వీనర్ మహేష్, ప్రచార కార్యదర్శి పరికిపండ్ల వేణు, సలహా మండలి సభ్యులు మురళి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : కోలాటం ఆడుతున్న మహిళలు



ధర్మసాగర్: గుజరాత్‌లో బతుకమ్మ ఆడుతున్న హనుమకొండ మహిళలు

## బెల్టుషాపులపై పోలీసుల మెరుపుదాడులు



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు



స్వాధీనం చేసుకున్న మద్యం

**ఆత్మకూరు :** మండలంలోని అక్కంపేటలో గల బెల్ట్‌షాపులపై దాడులు చేసినట్లు సీఐ రవిరాజు తెలిపారు. ఈ దాడుల్లో రూ.16 వేల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న సాదిక్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై రాజేష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

**ధర్మసాగర్:** మండలంలోని దేవునూర్ గ్రామంలో గల బెల్టుషాపులపై స్థానిక సీఐ శ్రీధర్‌రావు సోమవారం దాడులు చేశారు. అవేలి రాజేశ్వర్‌రావు షాపులో సోదాలు చేయగా రూ. 14,800 విలువ చేసే మద్యం బాటిళ్లు లభించినట్లు తెలిపారు. అలాగే పెద్దపెండ్యాలలోని పబ్బ వెంకటేశ్వర్లు షాపుపై దాడులు చేయగా రూ. 9,905 విలువ గల మద్యం బాటిళ్లు లభించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధినం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ దాడుల్లో ధర్మసాగర్ ఎస్సై పిలిప్‌రాజ్, వేలేరు ఎస్సై హరిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఎల్కుర్తి క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.

## బీఆర్ఎస్ నాయకుల హర్షం

**శాయంపేట :** స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ బీఫాం అందించిన సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**మహిళలు అండగా నిలవాలి**

**హన్మకొండ:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సోనియాగాంధీకి అండగా నిలబడి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని ఏఐసీసీ పరిశీలకుడు ఉత్తమ్‌రావు దళ్వీ మహిళలను కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ 9వ డివిజన్ పెద్దమ్మగడ్డ సమీపంలోని ఐకే గార్డెన్‌లో మహిళా సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన దళ్వీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి పేదల కష్టాలను దూరం చేస్తామన్నారు. జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. దాస్యం వినయ్‌భాస్కర్ నాలుగుసార్లు గెలిచి వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని సమస్యల ఊబిలోకి నెట్టారన్నారు.

**పండుగ వేళ వేతనాల్లో హెచ్చుతగ్గులు**

**వరంగల్ అర్బన్:** గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, అర్బన్ మలేరియా ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు కొందరికి ఎక్కువగా, మరికొందరికి తక్కువగా జమయ్యాయి. సెప్టెంబర్‌కు సంబంధించిన వేతనాల్ని ఈనెల 13న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పండుగల వేళ తక్కువ వేతనం జమైన కార్మికులు ఆందోళన చెందారు. ఔట్‌సోర్సింగ్ వాహనాల డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు తక్కువ జమ కాగా.. అర్బన్ మలేరియా సిబ్బందికి వేతనాలు ఎక్కువ మొత్తంలో జమయ్యాయి. దీంతో వేతనాల్లో తేడాలపై బల్దియా కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, నాయకుడు పడా రాంమూర్తి తదితరులు వెంటనే అడిషనల్ కమిషనర్ రషీద్, సీఎంహెచ్‌ఓ రాజేశ్ దృష్టికి తీసుకెళ్లారు.

**కేటీఆర్ క్షమాపణ చెప్పాలి**

**హన్మకొండ:** నిరుద్యోగ అభ్యర్థి ప్రవళిక మృతిపై అవాస్తవాలు మాట్లాడుతున్న.. మంత్రి కేటీఆర్ ఆమె కుటుంబ సభ్యులు, యువతకు క్షమాపణ చెప్పాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యానగర్‌కు చెందిన కేయూ విద్యార్థి నాయకుడు నవజీవన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు బీజేపీలో చేరారు. రావు పద్మ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

**మృతుడి నేత్రాలు దానం..**

**ఖిలా వరంగల్:** వరంగల్ పడమరకోటకు చెందిన గద్ద భాస్కర్ (55) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి భార్య భారతి, కూతుళ్లు మౌనిక, రేఖ.. మృతుడి నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. సోమవారం మధ్యాహ్నం తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో మృతుడి నేత్రాలు సేకరించారు.

**బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం**

**హసన్‌పర్తి:** వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోరుతూ 56వ డివిజన్‌లోని పలు కాలనీల్లో నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేస్తాం**

**హసన్‌పర్తి:** వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ధీమా వ్యక్తం చేశారు. 56, 65వ డివిజన్లకు చెందిన పలు పార్టీల నాయకులు, బీజేపీలో చేరారు.

## కొండా మురళికి టికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

**నయీంనగర్:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండా మురళీధర్‌రావుకు పరకాల నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ అధిష్టానాన్ని పరకాల మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. ఏదైనా రాజకీయ కారణాలతో స్థానికేతరులకు టికెట్ ఇవ్వాల్సి వస్తే కొండా దంపతులు సూచించిన బలమైన వ్యక్తికే టికెట్ కేటాయించాలని కోరారు. హైకమాండ్ ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బీమగాని సౌజన్య, ఒంటేరు రాంమూర్తి, బొమ్మల కట్టయ్య, పర్నెం మల్లారెడ్డి, దుగ్యాల రాజేశ్వర్ రావు, శంకరయ్య, రాంచందర్, ఎల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ గ్రహీత అశోక్‌కు సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**కేయూ క్యాంపస్:** హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎలిశాల అశోక్‌కు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఓయూలో కెమిస్ట్రీ విభాగంలో పరిశోధకుడిగా అశోక్.. డిజైన్ మాలిక్యూలర్ మోడలింగ్ సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ 1, 8 నాప్తారీడినైల్ హెటిరో సైక్లిక్స్ అండ్ దేర్ బయాలాజికల్ ఎవాల్యూయేషన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సక్రం పర్యవేక్షణలో అశోక్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు మాట్లాడుతూ.. అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్ మరిన్ని పరిశోధనలు చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యార్థులను తీర్చిదిద్దుతూనే తన పరిశోధనలపై సమయం కేటాయిండం పట్ల వారు అభినందించారు. ప్రతీ ఒక్కరూ అశోక్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాగా, అశోక్‌ను హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు.

## ప్రపంచ అనస్తీషియా డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అనస్తీషియన్లు, సిబ్బంది

**ఎంజీఎం:** కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వరల్డ్ అనస్తీషియా డే వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనస్తీషియా ప్రొఫెసర్ హన్మంతరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడారు. 1846, అక్టోబర్ 16వ తేదీన డబ్లూటీజీ మోర్టాన్.. ఎలాంటి నొప్పి లేకుండా ఆపరేషన్ చేశారని గుర్తుచేశారు. ఆ రోజును వరల్డ్ అనస్తీషియన్ డేగా జరుపుకుంటున్నట్లు వివరించారు. వైద్యులు నాగరాజు, సాగర్, పద్మావతి, స్ఫూర్తి, శ్రీనివాస్ నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుశీల పాల్గొన్నారు.

## ఆదమరిస్తే ఔటే..



పరకాల-కౌకొండ ప్రధాన రోడ్డు పక్కన ఏర్పడిన గుంత

**నడికూడ:** మండలంలోని పరకాల– కౌకొండ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు తెగిపోయి కొట్టుకపోవడంతో పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారుతోందని ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు గుంతను పూడ్చి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**వరంగల్:** ఈనెల 17, 18 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నగరంలోని 14వ డివిజన్ రెడ్డిపాలెం ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ కృప మరియా మాట్లాడుతూ తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు కిరీటి, సద్విన్, అద్విత్, బాలివన్‌రాజ్, వరుణ్ ఎంపికయ్యారని తెలిపారు.

## శ్రీలక్ష్మినృసింహుడికి స్వాతి నక్షత్రోత్సవం



గర్భాలయంలో నక్షత్రహారతి ఇస్తున్న అర్చకుడు వంశీ

**ఐనవోలు:** మండలంలోని కక్కిరాలపల్లిలో స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మినృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం పంచామృత అభిషేకం జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తి చేసిన అనంతరం ధృవమూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మి-నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వర స్వామిల ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్ర హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వంశీ ఆచార్యులు, వెంకటరత్నమాచార్యులు, జయకృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ-రాణి దంపతులు, డైరెక్టర్ తాడెం మోహన్, సుధీర్-మమత దంపతులు, ఆత్మకూరు సురేందర్, గుండపు ఉమ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటా



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో పాడి కౌశిక్‌రెడ్డి

**కమలాపూర్:** తనను నమ్మి పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన సుమారు 20 మందికి విద్యార్థులు, బీజేవైఎం నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా ఆయన కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద తమ పదవులకు, బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. గత 15 ఏళ్లుగా తామంతా స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వెంటే ఉంటూ ఆయనను భుజాలకెత్తుకున్నామని, ఎవరెన్ని ప్రలోభాలకు గురి చేసినా, భయభ్రాంతులకు గురి చేసినా ఈటల గెలుపే తమ గెలుపుగా భావించి గెలిపించుకున్నామని తెలిపారు. అయినప్పటికీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తమకు తగిన గుర్తింపు ఇవ్వలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్, నియోజకవర్గంలో పాడి కౌశిక్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. మార్క అరవింద్‌గౌడ్, జనగాని రాకేష్, ప్రమోద్‌రెడ్డి, అజయ్, అశోక్, రాజు, సుమన్, యుగేందర్, మహేష్, సాయి, శ్రావణ్, శ్రీను, నాగరాజు, రాజేష్, వినయ్, శ్రీకాంత్, కర్ణాకర్, ప్రశాంత్, చందు, రాజేష్, రామ్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కరీంనగర్ జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, దేశిని కోటి పాల్గొన్నారు.

## బ్రహ్మచారిణి అలంకరణలో దుర్గామాత



బ్రహ్మచారిణిగా దుర్గామాత



గాయత్రిదేవీ అమ్మవారు

**ఆత్మకూరు:** మండల కేంద్రంలోని పోచమ్మసెంటర్‌లో శ్రీ వేణుగోపాలస్వామి భజనమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. అమ్మవారిని బ్రహ్మచారిణి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

**గాయత్రిదేవిగా అమ్మవారు**

**పరకాల:** పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకంతో పాటు ప్రధాన కళశస్థాపన, దీక్షధారణ, అంకురారోపణ, అఖండదీపస్థాపన, అగ్నిప్రతిష్టాపన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా సోమవారం అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ఈఓ వెంకటయ్య, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే 'అరూరి' గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మాదాసి బాబు

**ఐనవోలు:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను గెలిపించేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని బీఆర్ఎస్ పార్టీ పున్నేలు గ్రామ ఇన్‌చార్జ్‌లు మాదాసి బాబు, సోమేశ్వర్‌రావులు అన్నారు. మండలంలోని పున్నేలు గ్రామాన్ని సోమవారం సందర్శించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీలో అంతర్గత కలహాలకు చోటులేదన్నారు. ప్రతీ కార్యకర్త, నాయకుడు సమన్వయంగా ఉంటూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం డోర్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గోకె కర్ణాకర్, సర్పంచ్ కత్తి దేవేందర్, చాట్ల సారయ్య, జిల్లా సూరయ్య, తాండ్ర కోమలత, ఇల్లందుల పూర్ణచందర్, చాట్ల అరుణ్ కుమార్, కూనూరు భాస్కర్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో సంఘానికి గుర్తింపు



సెమినార్‌లో పాల్గొన్న కోసరి గోపాల్

**శాయంపేట :** ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని ప్రజ్వల్ రైతు కోసరి గోపాల్ అన్నారు. మండలంలోని వసంతాపూర్‌లో సోమవారం జరిగిన అంతర్జాతీయ ఐడీహెచ్, బీసీఐ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీఐ వారి ఆర్థిక, డబ్ల్యూడబ్ల్యూఎస్ ఇండియా సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్నటువంటి బీసీఐ, హెచ్ అండ్ఎం ప్రాజెక్టు కార్యక్రమాల గురించి పాల్పంచుకోవడం జరిగిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ వై ఇన్నారెడ్డి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**దామెర:** రాష్ట్ర అభివృద్ధి బీజేపీతో సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలో గడప గడపకు తిరుగుతూ పరకాల నియోజకవర్గంలో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థికి ఓటువేయాలని ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు మాయమాటలు చెబుతుందన్నారు. ఒకసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా యువమోర్చ కోశాధికారి చందర్, జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి రమణారెడ్డి, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు శ్రీను, రమేష్, పృధ్వీరాజ్, కొమురయ్య, సంతోష్, సాంబరాజు పాల్గొన్నారు.